ప్రజాశక్తి
గురువారం 23 మే 2024 | 5 | అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్



సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి పది రోజులు కావస్తోంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో టిడిపి, వైసిపి అభ్యర్థులు అన్ని అస్త్రాలను ప్రయోగించారు. పోలింగ్ ముగిసిన అనంతరం గెలుపుపై ఈ రెండు పార్టీల నేతలు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపై బయటకు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం భయం వెంటాడుతోంది. ముఖ్యంగా పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి అనుకూలంగా ఉంటుందన్న దానిపైనే ఎక్కువ ఆందోళన అభ్యర్థుల్లో కన్పిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచే అభ్యర్థులు వారి పరిధిలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో నమోదైన పోలింగ్ వివరాలను తీసుకుని ఎవరికి అనుకూలంగా ఓట్లు పడి ఉంటాయన్న దానిపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారు. ఈ సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా చూసుకున్నప్పుడు తమకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటూ అభ్యర్థులు, ముఖ్య నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొద్ది పాటి మెజార్టీతో అయినా తాము బయట పడుతామనే ఆశాభావంలో ఉన్నారు. ఇదే సమయంలో సర్వే ఏజెన్సీలతో పాటు నిఘా వర్గాల నివేదిక ఆధారంగా గెలుపుపై అంచనాకు వస్తున్నారు.

# పైకి గాంభీర్యం..లోపల భయం..!

- ◆ ఎన్నికల్లో గెలుపుపై అభ్యర్థుల్లో టెన్షన్
- ◆ పెరిగిన ఓటింగ్ శాతంపై లోలోన గుబులు
- ◆ పోలింగ్ సరళిపై సొంత సర్వేల ద్వారా ఆరా
- ◆ టిడిపి, వైసిపి నాయకుల ఎవరి ధీమా వారిదే..

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

పోలింగ్ ముగిసి దాదాపు పది రోజులు కావస్తున్నా పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు మాత్రం ఆగడం లేదు. మిగితా ఎన్నికల కంటే ఈ సారి ఓటర్లు భిన్నంగా ఓటు వేసి ఉంటారనే అంచనాలో అభ్యర్థులు ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. మహిళలు, యువత, వృద్ధులు ఇలా అందరూ కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార పార్టీపై వ్యతిరేకతతోనే ప్రజలు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారంటూ టిడిపి నేతలు చెబుతున్నారు. ఇదే సమయంలో ఐదేళ్ల పాలనలో తాము చేసిన సంక్షేమం, ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారంతా మరోసారి గెంలిపించాలన్న ఉద్దేశంతో ఓటింగ్ పాల్గొన్నారంటూ వైసిపి నాయకులు ధీమా ఉన్నారు.

**సర్వేల ద్వారానూ వివరాల సేకరణ**

పోలింగ్ అనంతరం అభ్యర్థులు, నాయకులు సర్వేల ద్వారా గెలుపుపై అంచనాలను తీసుకుంటున్నారు. కొందరు అభ్యర్థులు ఇప్పటికే సర్వే సంస్థలకు నియోజకవర్గంలో గెలుపోటములపై అంచనా వేసే బాధ్యతలను అప్పగించారు. 2019 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను పోలింగ్ బూత్‌ల వారీగా అంచనా కడుతున్నారు. సర్వే సంస్థలకు బాధ్యతలు అప్పగించి నియోజకవర్గంలో ఎక్కువగా శ్యాంపుళ్లను సేకరించి ఓటింగ్ సరళిపై ఒక అంచనాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గల్లో ఓటర్లకు ఫోను ద్వారా అభిప్రాయ సేకరణ జరుగుతోంది. తాము ఏపార్టీకి చెందిన వారం కాదని, కేవలం ఓటరు నాడిని తెలుసుకోవడానికి ఫోన్ చేస్తున్నాం అంటూ ఓటురు ఎవరికి ఓటు వేశారనే విషయం తెలుసుకునే ప్రయత్నం జరుగుతోంది. సామాజిక తరగతుల వారీగా కూడా అభిప్రాయ సేకరణ జరుగుతోంది. తద్వారా గెలుపోటములు నిర్ధేశించుకునే పనిలో అభ్యర్థులు పడ్డారు.

**విహారయాత్రలో ఉన్నా... ఓటింగ్‌పైనే చర్చ..!**

ఎన్నికల్లో గెలుపుకోసం దాదాపు మూడు నెలల పాటు అభ్యర్థులు ప్రచారాల్లో నిమగ్నం అయ్యారు. క్షణం తీరిక లేకుండా గడిపారు. పోలింగ్ ముగియగానే చాలా మంది అభ్యర్థులు కాస్త సేదదీరేందుకు విహార యాత్రలకు వెళ్లారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అభ్యర్థులు విహార యాత్రల్లో ఉన్నాగానీ గెలుపుపై ఎప్పటికప్పుడు నియోజకవర్గ, గ్రామ స్థాయి నాయకులతో మాట్లాడుతున్నారు. పోలింగ్ జరిగిన రెండు రోజుల తర్వాత పరిస్థితి ఎలా ఉంది..? వారం రోజుల తర్వాత ఎలా ఉంది.? ఇప్పుడెలా ఉంది..?! అంటూ ఆరా తీస్తున్నారు. ప్రజల నాడిని ఎప్పటికప్పుడు అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి రోజూ వారున్న ప్రాంతం నుంచే పోలింగ్ సరళిపై చర్చలు జరుపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మహిళల పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువ పెరగడం ఎవరికి లాభం అన్న దానిపేనే లెక్కలు వేస్తున్నారు. ఎన్ని లెక్కలు వేసుకున్నా చివరకు మాత్రం మనమే గెలవబోతున్నాం అంటూ ద్వితీయ శ్రేణి నాయకుల వద్ద అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల్లో కూడా ఉత్కంఠ**

పోలింగ్ ముగిసిన అనంతరం ప్రజల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తున్నారన్న దానిపై ఉత్కంఠ పెరిగింది. ఎవరు గెలుస్తారన్న దానిపై ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తునే రచ్చకట్ట చర్చలు జరుగుతున్నాయి. టిడిపి నాయకులు కలిసిన చోట వారి పార్టీ గెలుస్తుందని, వైసిపి నాయకులు కలిసిన చోట తాము గెలవబోతున్నాం అంటూ నాయకులు ధీమాగా ఉండడంపై ప్రజల్లోనూ ఉత్కంఠను రేపుతోంది. రెండు పార్టీల నేతలు ఎవరూ తగ్గడకుండా నమ్మకంగా ఉన్న నేపథ్యంలో ఫలితాలపై ఓటర్లు కూడా అత్యంత ఉత్సుకతతో ఎదరుచూస్తున్నారు.

---

90శాతం సబ్సిడీతో

# వేరుశనగ విత్తనాలు ఇవ్వాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు విత్తన వేరుశనగను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాంభూపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల వల్ల 29 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది అత్యధిక మంది రైతులు పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసి ఆదుకోవాలన్నారు. ఈ మేరకు ఈనెల 24వ తేదీన అన్ని మండల తహాశీల్దార్ కార్యాలయాల వద్ద రైతులకు మద్దతుగా ప్రభుత్వానికి విజ్ఞాపనలు అందజేస్తామన్నారు. గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేసేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు చేరుతున్న విత్తనాల నాణ్యతపై తనిఖీలు ముమ్మరం చేయాలని కోరారు. పత్తి విత్తనాల నాణ్యతాలోపం వల్ల గత సంవత్సరం జిల్లాలో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారని, ఈ సంవత్సరం అటువంటి పరిస్థితులు పునరావతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.సావిత్రి, బాలరంగయ్య, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, తరిమెల నాగరాజు, నాగమణి, నిర్మల, అచ్యుత్, భాస్కర్, జగన్, ముష్కిన్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

---

# తాడిపత్రిలో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

తాడిపత్రిలో పోలింగ్ రోజు, ఆ తర్వాత హింసతో చెలరేగిన అల్లర్లపై సిట్ బందాల దర్యాప్తు కొనసాగుతోంది. తాడిపత్రికి సిట్ బందం మరోసారి వచ్చింది. సిట్ బందం తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడులకు సంబంధించిన వీడియోలు, రికార్డులను పరిశీలించారు. అల్లర్లకు ప్రధాన కారణంగా గుర్తించిన రాళ్లదాడిని ఎందుకు నియంత్రించలేకపోయారని స్థానిక పోలీసులను సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఎస్‌బి అధికారులు ముందే గుర్తించి సమాచారం ఇచ్చారా? లేదా? సమాచారం ఇచ్చినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేస్తోందని సమాచారం. తాడిపత్రి గొడవల నేపథ్యంలో ఇప్పటికే జిల్లా ఎస్పీతో పాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ సస్పెండ్ అయ్యారు. సిట్ దర్యాప్తు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని మరికొందరు పోలీసులు ఆందోళన చెందుతున్నారు. కౌంటింగ్ పూర్తయ్యేవరకూ సిట్ బందం తాడిపత్రిలోనే ఉండి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. సిట్ దర్యాప్తుతో ఇప్పటివరకు 728 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. సిట్ ఇప్పటివరకు చేసిన దర్యాప్తును బహిర్గతం చేయాలని తాడిపత్రి ప్రజలు కోరుకుంటున్నారు.

---

# తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

- ◆ సిఐటియు నేత ఓబులుకు కలెక్టర్ హామీ
- ◆ విధుల్లోకి చేరిన కార్మికులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

మోటార్లు ఆన్ చేస్తున్న కార్మికులు

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ నాలుగు రోజులుగా మోటార్‌లు నిలిపివేసి నిరసన చేపట్టారు. కార్మికుల నిరసన విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సత్వరమే స్పందించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలకు ఉపక్రమించారు. బుధవారం నాడు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులుతో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ క్రమంలో సిఐటియు నేత ఓబులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా కలెక్టర్‌కు వివరించారు. కార్మికులు వేతనాల కోసం ప్రతి నెలా రోడ్లు ఎక్కి అరిస్తే తప్పా సజావుగా జీతాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. నాలుగు నెలల వేతనాలు బకాయిలుంటే సమ్మె చేసిన సందర్భంలో 2 నెలలు వేతనాలు వేయడం సమ్మె విరమింపజేయడం పరిపాటిగా మారిందన్నారు. తాగునీటి సరఫరా కార్మికులు ట్రంక్ లైన్, ఫేస్ 4 కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, మడకశిర కార్మికులందరూ 14 నెలల నుంచి 25 నెలల వరకు పిఎఫ్, 4 నెలల నుంచి 6 నెలల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్లకు నిధులు విడుదల కాలేదంటూ చెబుతున్నారని వివరించారు. 3 నెలలుగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, డివిజన్ కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి 12 సంవత్సరాలుగా పని చేస్తున్న 18 మంది కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. పిఎఫ్ రూ.300 వేయలేదన్నారు. లీకేజీలకు మరమ్మతులకు వస్తువులు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ శివారెడ్డి, కాంట్రాక్టర్ గోవర్ధన్ రెడ్డిలకు ప్రభుత్వం నుంచి నిధులు రానందున 14 నెలల పిఎఫ్ వేయలేకపోయామని చెబుతున్నారన్నారు. వీటన్నింటిపై కలెక్టర్ స్పందించారు. తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గురువారం నాడు కాంట్రాక్టర్‌లతో సమావేశం జరుపుతామని హామి ఇచ్చారు. కార్మికుల సమస్యపై రాష్ట్ర సిసి దృష్టికి వెళ్లిందన్నారు. కార్మికులందరూ విధుల్లోకి వెళ్లేలా చూడాలని ఓబులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ హామీతో కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఓబులు కార్మికులు విధుల్లోకి చేరుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ హామీ మేరకు కార్మికులందరూ బుధవారం సాయంత్రం నుంచి విధుల్లోకి చేరారు. ఈ నిరసన కార్యక్రమానికి సహకరించిన కార్మికులు, రైతులు, ప్రజలందరికీ సిఐటియు గౌరవాధ్యక్షులు ఓబులు, యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, గంగాధర్, రాము, నరేష్, వన్నూరుస్వామి, రామాంజనేయులు కతజ్ఞతలు తెలియజేశారు.

---

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు

# పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు, మే – 2024పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2–30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 170 జూనియర్ కళాశాలలు ఉండగా, 18 జోన్లలో, 22 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. 34 కళాశాలల్లో థియరీ ఎగ్జామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 16,901 మంది, రెండవ సంవత్సరం 5,609 మంది విద్యార్థులు పరీక్షలకు విద్యార్థులు హాజరు అవుతారన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, డివిఈవో వెంకటరమణ నాయక్, డీఈవో వరలక్ష్మి, ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ డా॥సుజాత, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

# పోలీసుల మాక్‌డ్రిల్

**తాడిపత్రి రూరల్ :** రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో డీఐజీ షిమోషీ, ఎస్పీ గౌతమిశాలి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. ఘర్షణను తలపించేలా పోలీసులు విన్యాసాలు చేశారు. ఘర్షణలు నిజంగా జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, అల్లరి మూకలను ఎలా చదరగొట్టాలనే విషయాన్ని వివరించేలా మాక్‌డ్రిల్ సాగింది.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

---

# వైవిధ్యభరితం..పర్యావరణహితం..!

◆ ఉద్యానవపంటలతో కర్బన ఉద్గారాలు తగ్గింపు ◆ సాగుచేసే రైతుకు ప్రోత్సాహకాలు ◆ ఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో అమలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

బుక్కచెర్ల గ్రామంలో సాగు చేసిన ఉద్యానవన పంట

పర్యావరణ కాలుష్యంతో భూతాపం పెరిగిపోతోంది. ఈ విపత్తును తగ్గించేందుకు పర్యావరణ సమతుల్యత కోసం అంతర్జాతీయంగా వివిధ రకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న వారికి కార్బన్ రిమూవల్ యూనిట్స్ పేరుతో ప్రోత్సహకాలు అందిస్తున్నాయి. ఈ రకంగా పచ్చదనం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అనంతపురం జిల్లా ఉంది.

పది శాతంలోపే అటవీభూమి ఉన్న ఈ జిల్లాలో పచ్చదనం పెంపుదలకు కృషి చేస్తున్న వారికి కార్బన్ రిమూవల్ యూనిట్స్ పేరుతో ప్రోత్సహకాలు అందించేందుకు నెథర్లాండ్స్‌కి చెందిన రాబో బ్యాంకు ముందుకొచ్చింది. క్షేత్రస్థాయిలో అనంతపురం జిల్లాలో అమలు చేసే బాధ్యతను యాక్షన్ ప్రెటర్నా (ఎఫ్ ఎకాలజీ) కేంద్రం చేపట్టింది. ఆ సంస్థ పనిచేస్తున్న 15 మండలాల్లో దీని అమలుకు సమయత్తమైంది. వీరి పరిధిలో సుమారు 8300 మంది రైతులు ఉండగా, 10230 హెక్టార్ల పంటలు సాగు చేస్తున్న వారున్నారు. తొలుత రాప్తాడు మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో దీని అమలు మొదలు పెట్టారు. ఈ గ్రామం పరిధిలో ఉద్యనవన పంటలు సాగు చేసే రైతులు ఒక్క పంటే కాకుండా అందులో పది రకాలైన ఉద్యానవన పంటలను వైవిద్య భరితంగా సాగుకు ముందుకొచ్చినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇందుకు అవసరమైన సహకారాన్ని, తోడ్పాటును ప్రారంభం నుంచి ఎఫ్ ఎకాలజీ సంస్థ అందిస్తుంది. అంతేకాకుండా వైవిద్య సాగు వలన ఏ మేరకు పచ్చదనం పెరిగింది... ఏ మేరకు కర్బన ఉద్గారాల తగ్గింపు జరిగిందన్న దానిపై శాటిలైట్ ద్వారా మదింపు చేస్తారు. బాగా పచ్చదనం పరిరక్షణ చేపట్టిన రైతులకు కర్బన ఉద్గారాల తగ్గింపునకు ప్రోత్సహకం అందిస్తారు. ఈ రకంగా రైతుకు సగటున నాలుగు వేల వరకు ఆదాయం సమకూరే అవకాశాలున్నట్టు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. దీన్ని విస్తతంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టినట్టు ఎఫ్ ఎకాలజీ డైరెక్టరు మల్లారెడ్డి తెలిపారు.

**అవగాహన కల్పించడంతో ముందుకొచ్చాం..**

ఉద్యానవన పంటలను ఒక్క రకమే కాకుండా అందులో గట్ల వెంట సరుగుడు, టేకు, గంధంతోపాటు మధ్యమధ్యలో జామ, సోపాట, మామిడి వంటి వివిధ రకాల పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యాం. దీని ద్వారా ఒక్క పంటతోనే కాకుండా వివిధ రకాల పంటల ద్వారానూ అదనపు ఆదాయం రైతుకు సమకూరుతుంది. పైగా ప్రోత్సహకం కూడా అందిస్తామని చెబుతున్నారు. దీంతో ఈ రకమైన విధానంలో పంటలు సాగు చేస్తున్నాం.

**ప్రతాప్‌రెడ్డి, రైతు బుక్కచెర్ల గ్రామం.**

**పర్యావరణహితం.. రైతుకు ప్రయోజనం**

పర్యావరణ అసమ తుల్యతతో వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. అనేక అనర్థాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఈ అంశాన్నే తాము పనిచేసే ప్రాంతాల్లో రైతులకు వివరిస్తున్నాం. రైతుకు వివిధ రకాల పంటల వలన ఆదాయం సమకూరడంతోపాటు, పర్యావరణ హితం జరుగుతుంది. అనేక మంది రైతులు ఈ రకమైన పంటల సాగుకు ముందుకొస్తున్నారు. రాబోయే రోజుల్లో దీనిపై మరింత మందిలో అవగాహన కల్పించి వైవిద్యభరితమైన ఉద్యానవన పంటల సాగు చేపట్టే విధంగా కషి చేస్తాం.

**వైవి.మల్లారెడ్డి ఎఫ్ ఎకాలజీ డైరెక్టర్.**

**ప్రోత్సాహకాలు అందిస్తాం**

పర్యావరణ పరిరక్షణ ఇప్పుడు అంతర్జాతీయంగా అందరి ముందున్న సవాలు. వాతావరణంలో మార్పులు సంభవించి ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో పర్యావరణ పరిరక్షణపై అంతార్జతీయం అనేక సంస్థలు దృష్టి సారించాయి. ఈ రకంగా పరిరక్షించేందుకు ముందుకొచ్చే వారికి ప్రోత్సహకాలు అందివ్వాలని నిర్ణయించారు. దీని అమలు చేసే బాధ్యతను తాము చేపట్టాం. జిల్లాలో బుక్కచెర్ల గ్రామంలో ఈ రకంగా ఒక రైతు వైవిద్యభరితమైన పంటల సాగును చూశాను. ఇదే రకంగా ఇతర రైతులకు ముందుకొచ్చి పర్యావరణ పరిరక్షణతో తోడ్పాటునందివ్వాలి.

**అన్నే లాట్ కెమ్మా, రాబో బ్యాంకు ఆర్‌ఎం.**

---

# మూఢ విశ్వాసాల నిర్మూలనకు కృషి

## జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

**ప్రజాశక్తి కళ్యాణదుర్గం**



సమావేశంలో మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

మూడ విశ్వాసాల నిర్మూలనక విద్యావంతులు తమవంతు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ సభ్యులు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ విద్యావంతులు మూఢనమ్మకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టి నిరీక్షణ విముక్తి పరచాలన్నారు. ముఖ్యంగా చేతబడుల కార్యకలాపాలతో సామాన్య జనం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మూఢనమ్మకాల పేరుతో వంచిస్తూ మోసం చేస్తున్నారన్నారు. సైన్స్ యుగంలో మూఢనమ్మకం లేదనే విషయాలను గుర్తు చేశారు. మూఢనమ్మకంపై పలు రకాల కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అలాంటి నమ్మకాలను పారదోలేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు మల్లికార్జున, చిత్తప్ప, గంగానాయక్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, చిన్న మల్లప్ప, విజయకృష్ణ, శ్రీనివాసులునాయుడు, భగవాన్‌దాస్, నాగరాజు, అజయ్‌కుమార్, కంబాల నందన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

---

# వడ్డించే వాడు మనోడైతే..!

**నాన్ పిహెచ్‌ను పిహెచ్‌గా మార్పు**

**తాడిపత్రి మున్సిపాల్టీలో ఇష్టారీతిన సిబ్బంది మార్పులు**

**ప్రజాశక్తి-అనంతపురం**

వడ్డించే వాడు మనోడైతే బంతిలో ఎక్కడున్నా ఒక్కటేనన్న చందంగా మారింది తాడిపత్రి పురపాలక సంఘంలోని అధికారుల తీరు. తమకు అనుకూలమైన సిబ్బంది ఉంటే అనుకున్న చోటుకు అనుకూలమైన విధంగా నిబంధనలను సైతం పక్కనపెట్టి మార్పులు, చేర్పులు చేయడం విమర్శలకు తావిస్తోంది. పురపాలక సంఘంలో ఉన్నతాధికారి వద్ద పనిచేసే ఒక కార్మికురాలు నాన్ పిహెచ్ కింద నియామకమైతే ఆమెకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనలకు విరుద్ధంగా పిహెచ్ కిందకు మార్పులు చేయడం వెనుక మతలబులున్నాయన్న ఆరోపణలున్నాయి. మున్సిపల్ కమిషనర్ ఇంట్లో పనిచేసే కార్మికురాలు అలివేలమ్మ నాన్ పిహెచ్ కార్మికురాలుగా నియామకమైంది. అయితే ఆమెను నిబంధనలకు విరుద్ధంగా పిహెచ్ కిందకు మార్పు చేశారు. దీనిపై పెద్దఎత్తునే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలంగా లేకపోతే మాత్రం ఈ రకమైన మార్పులు చేయడానికి వీలుండదని నిబంధనలు చెబుతున్నారు.

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి**

**జగన్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు**

నాన్‌పిహెచ్‌ని పిహెచ్ కింద మార్చడంలో ఎటువంటి నిబంధనల్లేవని చెప్పే అధికారులు ఒకరి విషయంలో మాత్రం ఏ రకంగా మార్పులు చేపట్టారో చెప్పాలి. పురపాలక సంఘం పరిధిలో 20 మంది కార్మికులు ఈ రకమైన మార్పులు చేయమని కోరుతున్నా నిబంధనలు చూపుతున్న అధికారులు, ఈ ఒక్క విషయంలో ఏ రకంగా చేపట్టారని ప్రశ్నించారు. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

# సీసీ రోడ్డును పూర్తి చేయాలి : సిపిఎం

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-పెద్దపప్పూరు**

మండల కేంద్రంలోని కొత్త సుంకులమ్మ వీధిలో అర్థాంతరంగా ఆగిన సీసీరోడ్డును వెంటనే పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం గౌరవాధ్యక్షులు అమ్మలదిన్నె కుళ్లాయప్ప, మండల నాయకులు కాశెట్టి నారాయణస్వామి మాట్లాడుతూ కొత్త సుంకులమ్మ వీధిలో ఆరునెలల క్రితం సీసీ రోడ్ల సగం వరకూ వేసి నిలిపివేశారన్నారు. దీంతో వర్షం వస్తే రోడ్డుపై నీరు ఇళ్లలోకి చేరుతోందన్నారు. అంతేగాకుండా వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి కొత్త సుంకులమ్మ వీధిలో ఆగిన సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని సోమనపల్లి, ధర్మాపురం, కొత్తపల్లి గ్రామాల్లో కూడా రోడ్లపై నీరు పోయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిక్క రాముడు, ప్రసాద్, వెంకటరమణ, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఉత్సవాలు చేసుకోవాలి

## కలెక్టర్ వినోద్‌కుమార్

వేల్పుమడుగు గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

సార్వత్రిక ఎన్నికలు ముగిసేంత వరకూ శాంతిభద్రతలను కాపాడాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామంలో పర్యటించి జాతర నిర్వహణపై సుంకులమ్మ ఆలయంలో గ్రామ ప్రజలు, పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సమయంలో 22 ఆలయాల్లో జాతరలు జరగనున్నాయన్నారు. ఆయా ఆలయాలకు ఆర్‌డిఓలు, తహశీల్దార్లు వెళ్లి గ్రామస్తులు, పెద్దలతో మాట్లాడుతున్నారన్నారు. అదేవిధంగానే వేల్పుమడుగులో సుంకులమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామంలో జాతరను పెద్దగా జరుపుకోవాలని ఆలోచన ఉంటుందని, అయితే ఎన్నికల పరిమితులను కాపాడాలన్నారు. జాతరను ఎన్నికల కౌంటింగ్ అనంతరం జరుపుకునేందుకు మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక భక్తుడిలా జాతరలో పాల్గొనాలని, ఎవరూ గొడవలకు పాల్పడరాదన్నారు. ఇందుకు అందరి సహకారం అందించాలన్నారు. ఎన్నికలంటే ఎవరో ఒకరు గెలుస్తారని, ఫలితాలను అందరూ స్వాగతించాలన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి..ఆలయంలో ఎన్నిసార్లు పూజలు చేస్తారు, తదితర వివరాలపై ఆరాతీశారు. అంతకుముందు సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**తహశీల్దార్ కార్యాలయం తనిఖీ**

విడపనకల్లు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను ఆరాతీశారు. అనంతరం రికార్డ్ గది, ఎఫ్ఎంబి, డిపట్టా రిజిస్టర్, హౌస్ సైట్ రిజిస్టర్, మెజిస్ట్రేట్ వారి రిజిస్టర్, మండల మ్యాప్, కార్యాలయ పరిసర ప్రాంతాలను, అన్ని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి సేవలందిస్తున్నారనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలంలో సిసిఆర్‌సి కార్డులను కూడా మంజూరు చేసేందుకు రైతులను గుర్తించాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు కేటాయించాలన్నారు. ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను మంజూరు చేయించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో గుంతకల్లు ఆర్‌డిఒ వి.శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్ దస్తగిరయ్య, ఎంపిడిఒ వి.కొండయ్య, డిప్యూటీ తహశీల్దార్ బసవకుమార్, రీసర్వే డిటి వెంకటేశ్వర ప్రసాద్, ఎస్ఐ ఖాజా హుస్సేన్, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** మండల కేంద్రంలో వెలసిన ఎర్రితాత ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జెడ్పీ సీఈవో వై కోమా నిధియాదేవి సూచించారు. బుధవారం ఎర్రితాత ఆలయాన్ని సందర్శించి స్థానికలతో సమావేశం నిర్వహించార. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నార. కావున ప్రజలు అందుకు లోబడి ఉత్సవాన్ని జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరినాథ్‌రావు, ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దామోదర్, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

**పుట్లూరు :** మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో ఈనెల 25 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించనున్న అంకాలమ్మ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆర్‌డిఒ గ్రంధి వెంకటేష్ సూచించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ ఉన్నందున బుధవారం గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా సంతోషంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి, ఎస్ఐ ఏమాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## యువతి ఆత్మహత్య

మృతిచెందిన ఇందు

**పుట్లూరు :** అనారోగ్య కారణాలతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మడిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి కూతురు బూజుల ఇందు (18) అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

**గుత్తి :** పట్టణంలోని అనంతపురం రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దవడుగూరు గ్రామానికి చెందిన శ్రీనివాస శర్మ, వసీం ద్విచక్ర వాహనంలో గుత్తికి బయలుదేరారు. స్థానిక పట్టణంలోని గుత్తి-అనంతపురం గ్రామ మలుపు సమీపంలో 44వ జాతీయ రహదారి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ వర్మ వసీం లను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు శ్రీనివాస్ వర్మను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# కమనీయం...లక్ష్మీనారసింహుని కళ్యాణం

లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

నరసింహ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా సాగింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామి, ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం, హరిప్రసాద్, భరద్వాజ్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకుపూజ, నైవేద్య పూజలు చేశారు. మధ్యాహ్నం శ్రీవారి కళ్యాణం చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుల ధర్మన్న, కోశాధికారి నరసింహులు, ఉప కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, సభ్యులు గురునాథరెడ్డి, రామ్‌రెడ్డి, కమలాక్షుడు, వెంకట్‌రెడ్డి, తిప్పేస్వామి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

సతీసమేత లక్ష్మీనరసింహస్వామి

**కుందుర్పి :** మండల కేంద్రంలోని కోటలో వెలిసిన లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం వేదపండితులు మూలమూర్తికి పంచామృతాభిషేకం, మహా పూర్ణహతి, అనంతరం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. తర్వాత హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమరావతి నరసప్ప, పార్వతమ్మ కుటుంబ సభ్యులు భక్లుకు అన్నదానం చేశారు. అనంతరం ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, గ్రామ సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి, లక్ష్మీనరసింహస్వామి పురోహితుడు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల గుండా స్వామివారిని ఊరేగించారు.

# రేపటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

**నార్పల :** మండల వ్యాప్తంగా రేపటి నుంచి రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేయమన్నట్లు మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రషన్ కొనసాగుతోందన్నారు. పేర్లు నమోదు చేసుకుని, వేలిముద్రలు వేసి కూపన్లు తీసుకున్న రైతులకు శుక్రవారం నుంచి విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పదును అయిందన్నారు. సబ్సిడీ వేరుశనగ తీసుకున్న రైతులు తప్పనిసరిగా విత్తనం వేసుకోవాలన్నారు. అలాకాకుండా దళారుల మాయమాటలు విని సబ్సిడీ విత్తన వేరుశెనగను వ్యాపారుల పాలు చేయొద్దన్నారు. సబ్సిడీ వేరుశనగ అమ్మినా, కొన్నా నేరమన్నారు.

# వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

రికార్డులను పరిశీలిస్తున్న ఉమామహేశ్వరి

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

మండల పరిధిలోని పంపనూరు రైతు భరోసా కేంద్రంలో చేపట్టిన రైతుల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయన నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరి బుధవారం పరిశీలించారు. అనంతరం విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేరుశెనగ పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే సకాలంలో విత్తన కాయలను అందజేయాలని ఆర్‌బికె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుచరిత, ఆర్‌బికె సిబ్బంది శోభారాణి, రైతులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** మండల కేంద్రంలో వినాయక సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్వీకరించిన విత్తనాలు, శుభ్రం చేసిన విత్తనం వివరాలు, వివిధ రైతు భరోసా కేంద్రాలకు పంపిన వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ యల్లప్ప, వ్యవసాయ అధికారులు పృథ్వీసాగర్, వాసుకీరాణి, రాకేష్‌నాయక్, తదితరుల పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

## టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

నాలుగు రోజులు క్రితం గుత్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అనంతపురం వాసుల కుటుంబ సభ్యులకు టిడిపి అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈమేరకు బుధవారం మృతుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతిచెందిన వారికి ఒక్కొక్కరికి రూ.20 లక్షలు ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుర్రం నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, అసెన్, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, నాయకులు ఐఎంఎం భాష, శ్రీనాథ్, కళ్యాణ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి కార్యాలయం పరిశీలన**

అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ బధవారం పరిశీలించారు. నెలన్నర క్రితం టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఆవేశంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బుధవారం కార్యాలయానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం అందుబాటులో ఉన్న నాయకులతో ఎన్నికల పోలింగ్ సర్వేపై చర్చించారు. అర్బన్ నియోజకవర్గంలో ఎక్కువమంది టిడిపి వైపు ముగ్గు చూపారని నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, గంగారామ్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, బిసి సంఘం నేతలు జోగి రాజేంద్ర, బండి విశ్వనాథ్, జస్వంత్ వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

**వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షల వెల్లువ**

దగ్గుపాటి ప్రసాద్, శ్రీలక్ష్మి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయానికి పెద్ద ఎత్తున నాయకులు తరలివచ్చి దగ్గుపాటి ప్రసాద్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు జిల్లా పార్టీ కార్యాలయంలో కూడా దగ్గుపాటి ప్రసాద్‌కు నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

# పుట్లూరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వీర్రాజు

**పుట్లూరు :** మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వీర్రాజు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ దస్తగిరి ఈనెల 31వ తేదీ వరకూ సెలవుపై వెళ్లడంతో యల్లనూరు ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న వీరరాజును ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మాట్లాడుతున్న ఎపిడి వెంకటరత్నం

## 'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

**పుట్లూరు :** మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎపిడి వెంకటరత్నం సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎపిడి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కూలీల సంఖ్య పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యల తీసుకోవాలన్నారు. అదేవిధంగా కూలీలను ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ, సాయంత్రం పనులు చేసే విధంగా కృషి చేయాలన్నారు. పనులు చేసిన వారికి త్వరగా బిల్లులు పడేవిధంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మండల సమావేశం

**రాయదుర్గం రూరల్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి విద్యావతి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మూడు అంశాలపై మాత్రమే సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్యం, ఉపాధి, గ్రామీణ నీటి సరఫరా అంశాలకు సంబంధించి సమావేశంలో చర్చించామన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లాబకాష్

## నార్పలలో సమ్మర్ క్యాంపు

**నార్పల :** మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా 6వరోజు బుధవారం విద్యార్థులకు కథలు చెప్పడం,కథల పుస్తకాలు చదివించడం, క్యారమ్స్, చెస్ తదితర ఆటలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి జీవన తెలిపారు.

## ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా

**కళ్యాణదుర్గం :** ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆర్‌డిఒ రాణీసుస్మిత సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ మండలాల పరిధిలోని సహజ వనరులను గుర్తించడంతోపాటు సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై పర్యవేక్షించి నివేదిక అందజేయాలన్నారు. అదేవిధంగా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో విచారించి సత్వర పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాణీసుస్మిత

# అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

## స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత, డయల్-100 విభాగాల పరిశీలన

డయల్-100 విభాగంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిశాలి

**ప్రజాశక్తి-అనంతపురం క్రైం**

జెఎన్‌టియులోని స్ట్రాంగు రూంల భద్రత, డయల్ 100 విభాగం పోలీసుల పనితీరును ఎస్పీ గౌతమిశాలి అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో స్ట్రాంగు రూంల వద్ద మూడంచెల భద్రతను పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని ఈసర్వేలెన్స్ సెంటర్‌కు చేరుకుని డయల్-100 విభాగాన్ని తనిఖీ చేశారు. అర్ధరాత్రి వేళ పోలీసుల సహాయం కోసం ప్రజలు, బాధితుల నుండి వచ్చే ఫోన్ కాల్స్‌కు ఎలా స్పందించి సంబంధిత పోలీసులను ఘటనా స్థలాలకు ఎలా పురమాయిస్తున్నారో సమీక్షించారు. ఈ తనిఖీల్లో జెఎన్‌టియు స్ట్రాంగు రూంల వద్ద భద్రతా విధుల్లో ఉన్న సాయుధ పోలీసులు, డయల్-100 విభాగం పోలీసులు అప్రమత్తంగా ఉన్నట్లు తేలింది. మరింత అప్రమత్తంగా ఉండాలని, చిత్తశుద్ధి, అంకితభావంతో విధులు చేపట్టి ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పని చేయాలని సూచించారు

# రికార్డులను పరిశీలిస్తున్న... 

# 'ఉపాధి' కల్పనలో నిర్లక్ష్యం వద్దు : ఎంపిడిఒ

**పెద్దవడుగూరు :** గ్రామాల్లో ప్రతి కూలీకీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనుల కల్పించాలని ఎంపిడిఒ గోపీకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించి వలసలను నివారించాలన్నారు. ముఖ్యంగా కూలీలకు అందజేస్తున్న వేతనం, రైతుల పొలాల్లో పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా పనితీరుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం సహాయాధికారి పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దేహదానానికి వీలునామా

దేహదాన అంగీకార పత్రాన్ని అందజేస్తున్న నాగరాజు

**అనంతపురం :** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎంఎన్‌ఒగా పనిచేస్తున్న నాగరాజు తన మరణానంతరం దేహాన్ని అనాటమీ విభాగానికి అందించేందుకు దేహదాన వీలునామా పత్రాన్ని బుధవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, అనాటమీ ప్రధాన విభాగాధిపతి ఎస్.ఉమామహేశ్వరరావు సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అన్ని దానాలలోను దేహదానం చాలా చాలా గొప్పదన్నారు. అలాంటి దేహదానం చేసిన నాగరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో పేథాలజీ ప్రధాన విభాగాధిపతి శివశంకరనాయక్, సామాజిక వైద్యశాస్త్ర ప్రధాన విభాగాధిపతి తెలుగు మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి, పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ

వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-అనంతపురం**

అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచందర్ స్వామీజీ ఆశీస్సులు, సహకారంతో ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా అనంతపురంలోని వీధి వ్యాపారులకు మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్ మాట్లాడుతూ చాలామంది రోడ్డు పక్కన ఎండను సైతం లెక్కజేయకుండా తోపుడుబండ్లపై కూరగాయలు, పండ్లు పెట్టుకుని అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అలాంటి వారికి ఉచితంగా గొడుగులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్, ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అవార్డు గ్రహీత జి.నందిత, ఎన్ఎస్ఎస్ రైపర్ కళాశాల స్టూడెంట్ కో ఆర్డినేటర్ ఎం.కిరణ్‌సాయి, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి వై.పవన్, నాగేంద్రప్రసాద్, అరుణ్ ఐస్‌క్రీమ్ వ్యాపారవేత్త రాఘవేంద్రయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరకు పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

రికార్డులుపరిశీలిస్తున్న వెంకటరాముడు

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

ప్రస్తుతం ఖరీఫ్ కాలంలో పత్తి విత్తనాలను బ్లాక్‌లోగానీ, అధిక ధరలకుగానీ విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుత్తి వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు హెచ్చరించారు. బుధవారం పెద్దవడుగూరులోని పలు ఎరువులు, విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి మల్లీశ్వరితో కలిసి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆదిత్య, శ్రీమారుతి దుకాణాలన తనిఖీ చేసి ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయించారదన్నారు. అలాగే రైతులకు విక్రయించిన తర్వాత బిల్లులు తప్పక ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

# సింహ వాహనంపై విహరించిన నారసింహుడు

చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు..

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నారసింహ జయంతి సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి మూల విరాట్ కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సింహ వాహనంపై విహరించారు. సింహ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారిని చూసి భక్తులు పులకించిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్, అర్చకులు ద్వారాకనాథ్, మయూరం బాలాజీ, గుండురావు తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఈరోజు సాయంత్రం చంద్రప్రభ వాహనంలో విహరించనున్నారు.

**చంద్రప్రభ వాహనంపై శ్రీవారు..**

పెన్నోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీవారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో అర్చకులు, ఆలయ సిబ్బంది, ఉత్సవ దాతలు పాల్గొన్నారు.

# విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎఒ నిర్మల్‌కుమార్

**ప్రజాశక్తి-గుమ్మఘట్ట**

విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాసుబుక్కులతో ఆర్‌బికెలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నిర్మల్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మండలంలో చేపట్టిన రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని14 పంచాయతీలకు 400 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మండలానికి వచ్చినట్లు తెలిపారు. మరో పంచాయతీ సిరిగేదొడ్డికి రేప విత్తనకాయల రానున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ వచ్చిన కాయలను ప్రతి రైతుభరోసా కేంద్రానికీ 100.20 క్వింటాళ్లు కేటాయించామన్నారు.

# పర్సా సత్యనారాయణ ఆశయాలు కొనసాగిద్దాం

## వర్ధంతి కార్యక్రమంలో సిఐటియు నాయకులు

**అనంతపురం కలెక్టరేట్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారాయణ ఆశయాలు కొనసాగించి నిజమైన నివాళి అర్పిద్దామని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమని, నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ అన్నారు. బుధవారం గణేనాయక్ భవన్‌లో సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారాయణ 9వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ సింగరేణిలో చిరు ఉద్యోగిగా పని చేస్తూ కార్మికులను ఐక్యం చేసి యూనియన్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్మిక హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేశారని, జైలు జీవితం గడిపారని కొనియాడారు. కార్మిక, కర్షక ఐక్యత కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాటాలను ఆదర్శంగా తీసుకుని హక్కుల సాధనకు ఐక్యంగా పని చేద్ధామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి, నాయకులు చంద్ర, రంగమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్సా సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు